త్వరలో భూభారతి అమలు

మంత్రి పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): భూభారతి చట్టాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకొస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. పొరపాట్లకు తావులేకుండా భూభారతి విధివిధానాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో కలెక్టర్లు, ఉన్నతాధికారులతో భూభారతి విధివిధానాలను రూపొందించడంపై జరుగుతున్న వర్క్‌షాప్‌లో బుధవారం మంత్రి సమీక్షించారు.

నిర్ణీతకాల ప్రమోషన్స్ కల్పించాలి

మంత్రి రాజనర్సింహకు ప్రభుత్వ వైద్యుల సంఘం వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ వైద్యులకు నిర్ణీతకాల ప్రమోషన్స్ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేసింది. బుధవారం వెంగళరావునగర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు.

'సీఎంఆర్ఎఫ్'కు ఈసీ బ్రేక్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల విడుదలకు ఎలక్షన్ కమిషన్ బ్రేక్ వేసింది. బుధవారం ఈసీ ఉత్తర్వులు జారీచేసింది. మార్చి 4 వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయొద్దని పేర్కొంది.

మార్చి 31 వరకు ఎల్ ఆర్ఎస్ గడువు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ఎల్ఆర్ఎస్ గడువును మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రిజిస్ట్రేషన్ కాని లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు కూడా ఎల్ఆర్ఎస్ చేసుకోవచ్చని సూచించింది. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మంత్రులు హాజరయ్యారు.

కేటీఆర్ ఫొటో ఉన్నదా? టీస్టాల్ మూసెయ్!

- సిరిసిల్లలో సర్కార్ కక్షసాధింపు
- ఇటీవల బీఆర్ఎస్ నేతల అరెస్టులు
- ఇప్పుడు కేటీఆర్ బొమ్మ పెట్టుకున్నాడని టీస్టాల్ చిరువ్యాపారిపై బల్దియా ప్రతాపం
- ట్రేడ్ లైసెన్స్ లేదని అధికారుల సాకు
- కలెక్టరే మూసేయించారని బీఆర్ఎస్ విమర్శలు
- బాధితుడికి మద్దతుగా ఆందోళన
- టీ స్టాల్ నడిపే వ్యక్తిపై వేధింపులా?
- ప్రతిదీ గుర్తుపెట్టుకుంటం..
- కచ్చితంగా బదులిస్తం : కేటీఆర్ ఫైర్

బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో టీ స్టాల్‌ను తెరుస్తున్న బత్తుల శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల నియోజకవర్గంలో కేటీఆర్ ఫొటో కనిపిస్తే చాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం కుతకుతలాడుతన్నది. ఎక్కడ ఆయన బొమ్మ కనిపించినా తీసేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నది. కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే సిరిసిల్లలో రాజకీయ కక్షసాధింపు కొనసాగుతున్నదని రాజకీయవర్గాల్లో చర్చనడుస్తున్నది. సిరిసిల్ల నియోజకవర్గ ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ నుంచి ఏకంగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేటీఆర్ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కక్షపూరిత వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వివిధ కారణాలతో బీఆర్ఎస్ నాయకుల అరెస్టుల పర్వం, జైలుకు పంపడం లాంటి ఘటనలు మరువకముందే తాజాగా ఓ చిరువ్యాపారి కేటీఆర్ ఫొటోతో ఏర్పాటు చేసుకున్న టీస్టాల్‌నే మూసివేసే స్థితికి అధికార యంత్రాంగం దిగజారింది.

కేటీఆర్‌పై అభిమానంతో..

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద బత్తుల శ్రీనివాస్ కొన్నేళ్లుగా టీస్టాల్ నడుపుతున్నాడు. కేటీఆర్‌పై అభిమానంతో తన స్టాల్‌కు 'కేటీఆర్ టీ స్టాల్'గా పేరు పెట్టుకున్నాడు. హోటల్‌పై కేటీఆర్ చిత్రపటాలను ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం ఉదయాన్నే హోటల్ తీసిన శ్రీనివాస్ వద్దకు మున్సిపల్ అధికారులు వచ్చి ట్రేడ్ లైసెన్స్ లేకుండా హోటల్ ఎలా నడిపిస్తారని, దాన్ని మూసేస్తామని బెదిరించారు. హోటల్ మూయవద్దని, లైసెన్సు ఫీజు ఎంతో చెప్తే చెల్లిస్తానని శ్రీనివాస్ బతిలాడినా అధికారులు పట్టించుకోలేదు. వెంటనే క్లోజ్ చేయాలని చెప్పి వెళ్లిపోయారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి టీ స్టాల్ యజమాని బత్తుల శ్రీనివాస్‌కు మద్దతుగా నిలిచారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకోలేదన్న కారణంగా మున్సిపల్ అధికారులు మూసి వేయించిన టీస్టాల్‌ను బీఆర్ఎస్ నేతలు దగ్గరుండి తెరిపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకే తాము టీస్టాల్‌ను మూసి వేయించామని అధికారులు ఇచ్చిన సమాధానంపై నేతలు మండిపడ్డారు.

కలెక్టర్ ఆదేశాలతోనే మూసేయించినం

సిరిసిల్లలో కలెక్టర్ ఉదయం పర్యటించిన సమయంలో బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న దుకాణాలకు లైసెన్సులు ఉన్నాయా అని అడిగారు. లేవని చెప్పడంతో లైసెన్సు తీసుకునే వరకు దుకాణాలు బంద్ చేయాలని మౌఖిక ఆదేశాలివ్వడంతోనే హోటల్‌ను మూసివేయించినం.

– సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ప్రతిదీ గుర్తుపెట్టుకుంటం

'సిరిసిల్లలో టీ కొట్టు నడుపుకొంటున్న పేద వ్యక్తిని వేధించడం తగదు. అతడు కేటీఆర్ ఫొటో పెట్టుకున్నాడనే అక్కసుతో జిల్లా ఉన్నతాధికారులు కక్ష సాధింపులకు దిగడం సరికాదు.' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఎక్స్‌వేదికగా హితవుపలికారు. ప్రతిదీ గుర్తు పెట్టుకుంటామని, ఏదీ మర్చిపోబోమని, కచ్చితంగా బదులిస్తామని హెచ్చరించారు. టీ కొట్టు నడుపుకొంటున్న పేద వ్యక్తి ఆవేదన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.

నాకు కేటీఆర్ అంటే అభిమానం

నాలుగేండ్ల కిందనే కేటీఆర్ టీ స్టాల్ పెట్టుకున్న. మబ్బుల మూడు గంటలకు వచ్చి నా భార్య నేను హోటల్ నడుపుకుంటం. పొద్దుగాల పదైతే ఇక్కడికి ఎవరూ రారు. ఇన్నేండ్లలో నా హోటల్‌ను బంద్ చేయాలని ఏ సారూ అనలేదు. వాగును చూసేందుకు కొత్తగా వచ్చిన సారు తిరిగి వెళ్తున్న సమయంలో కేటీఆర్ బొమ్మను చూసి 20 నిమిషాల్లోనే మున్సిపల్ అధికారులను హోటల్ వద్దకు పంపిండు. కేటీఆర్ ఫ్లెక్సీ తీసెయ్యి అంటే తీసేసిన. కేటీఆర్ పేరు పెట్టుకుంటే గింత అన్యాయమా? కేటీఆర్ అన్న నాకు కూడా అన్నే. ఆయనంటే నాకు అభిమానం. అందుకే ఫొటో పెట్టుకున్న. లైసెన్సు ఫీజు ఎంతనో చెప్పండ్రి కడుతా.. నేను ఎవరికీ అన్యాయం చెయ్యలే. నాకు గుండె జబ్బు ఉన్నది. నాకేమన్న అయితే కలెక్టర్, కమిషనరే బాధ్యులు. నా పిల్లల గోస వారికి తాకుతది.

– బత్తుల శ్రీనివాస్, హోటల్ యజమాని

షరతులు కొందరికేనా?

- ఫుట్‌పాత్ షాపులన్నిటికీ ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నయా?
- కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ విషయంలో వర్తించని షరతులు
- స్టాల్ నడుపుకొనేందుకు స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశాలు
- రాష్ట్రవ్యాప్తంగా లైసెన్స్ లేకుండా ఎన్నో చిన్నపాటి షాపులు
- సిరిసిల్లలో టీకొట్టుకు లైసెన్స్ కావాలన్న అధికారులు
- ఇదేం ద్వంద్వ వైఖరి అంటూ పెదవి విరుస్తున్న నెటిజన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్లలో ట్రేడ్ లైసెన్స్ లేదని ఓ టీ షాప్‌ను మూసేయాలని మున్సిపల్ అధికారులు హుకుం జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఈ షరతులు అందరికా? కొందరికేనా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 'మీ బిల్లు మొత్తం వెయ్యి రూపాయలు.. రెండు లివర్లు ఎక్స్‌ట్రా' డైలాగ్‌తో యూట్యూబ్‌లో ఫేమస్ అయిన కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌కు ప్రజలు క్యూ కట్టారు. హైదరాబాద్‌లో ఆమె స్టాల్‌కు తండోపతండాలుగా వస్తున్న భోజన ప్రియులతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి ఫుడ్ స్టాల్‌ను అక్కడి నుంచి తీసేయాలని నోటీసులు జారీ చేశారు. ఆమెకు అన్యాయం జరిగిందని సోషల్ మీడియాలో వీడియోలు పెద్ద ఎత్తున రావడంతో సీఎం రేవంత్ స్పందించి బాసటగా నిలిచారు. ఫుడ్‌స్టాల్‌ను అక్కడి నుంచి తొలగించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అధికారులను, కేసుపై పునరాలోచించాలని డీజీపీని ఆదేశించారు. సీఎం రేవంత్ తనకు అండగా నిలిచినందుకు అభిమానంతో ఆయన ఫొటోను దేవుళ్ల వద్ద పెట్టి కుమారి ఆంటీ పూజలు చేస్తున్న వీడియో కూడా బుధవారం వైరల్ అయింది. అభిమానంతో తమకు ఇష్టమైన నేతల ఫొటోలను షాపులు వద్ద పెట్టుకోవడం సహజమని, అలాంటిది కేటీఆర్ ఫొటో ఉన్నదన్న కారణంగా సిరిసిల్లలో చిన్నపాటి టీ స్టాల్‌ను తొలగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం ఏమిటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో చిన్నపాటి షాపులు ట్రేడ్ లైసెన్స్ లేకుండా నడుస్తున్నాయని, ఒక్క సిరిసిల్లలోని టీస్టాల్‌కే ఇప్పుడు ట్రేడ్ లైసెన్స్ గుర్తొచ్చిందా అని నిలదీస్తున్నారు. ద్వంద్వ వైఖరిని మార్చుకోవాలని, స్వార్థరాజకీయాలకు సామాన్యులను బలిచేయొద్దని హితవుపలుకుతున్నారు.

రాష్ట్రానికి 231 కోట్ల వరదసాయం

- విడుదల చేసిన కేంద్రప్రభుత్వం
- ఏపీకి అత్యధికంగా 608 కోట్లు
- నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

హైదరాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): కేంద్రం నుంచి వరదసాయం నిధులు పొందడంలోనూ రాష్ట్ర సర్కారు విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు భారీ వర్షాలకు 5,438 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు అంచనా వేయగా, కేంద్రం మాత్రం కేవలం 231.75 కోట్ల సాయం మాత్రమే విడుదల చేసింది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే ఇంత తక్కువ నిధులు వచ్చాయనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. కేంద్రం వివిధ రాష్ట్రాలకు మొత్తం రూ.15 54.99 కోట్లను విడుదల చేసింది. ఇందులో అత్యధికంగా ఏపీకి రూ.608.08 కోట్లు విడుదల చేసింది. తెలంగాణకు అతి తక్కువ సాయాన్ని ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికను పట్టించుకోకుండా కేంద్రం అత్తెసరు సాయంతో సరిపెట్టడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ ఎంపీలు కేంద్రాన్ని సమన్వయం చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏపీ జలదోపిడీని నిలువరించండి

- తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలి
- తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతివ్వాలి
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి రబీ సీజన్‌లో అధిక నీటిని అక్రమంగా వాడుకుంటున్నదని, సత్వరమే జోక్యం చేసుకొని తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. జాతీయ నీటిపారుదలశాఖ మంత్రుల సదస్సు రాజస్థాన్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్నది. సదస్సు ముగిసిన అనంతరం బుధవారం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, జల్‌శక్తిశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జితో మంత్రి ఉత్తమ్ ప్రత్యేకంగా భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్రాష్ట్ర జల వివాదాలను సత్వరమే పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్టు వెల్లడించారు. సీతారామ, పాలమూరు – రంగారెడ్డితోపాటు తెలంగాణ నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులన్నింటికీ అనుమతివ్వడంతోపాటు, నిధుల సాయం చేయాలని కేంద్రాన్ని కోరారు. మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ నివేదికను నెలాఖరులోగా కేంద్రం అందించనున్నట్టు వెల్లడించారు. నీటి వినియోగానికి సంబంధించి లెక్కలను తీసేందుకు టెలీమెట్రీ వ్యవస్థలను అమలు చేయాలని కోరారు. సాగర్, శ్రీశైలం ఆనకట్టల మరమ్మతులకు డ్రిప్ నిధులను వినియోగించాలని కోరారు. ఆయా అంశాలపై కేంద్ర మంత్రి, కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని మంత్రి వెల్లడించారు.

మిర్చి, పత్తిని కొనుగోలు చేయండి

కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): మార్కెట్ ధరలకు మిర్చి, పత్తిని కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి లేఖరాశారు. అంతర్జాతీయ విపణిలో మిర్చి ధరలు తగ్గడంతో రాష్ట్రంలో మిర్చి రైతుల ఆందోళనలో ఉన్నారని.. రైతుల బాగు కోసం నాఫెడ్ ద్వారా మార్కెట్ ధరకు ఎండుమిర్చిని కొనుగోలు చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు.

పోలీస్‌శాఖకు స్కోచ్ సిల్వర్ అవార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీసుశాఖకు ప్రతిష్ఠాత్మక స్కోచ్ సిల్వర్ అవార్డు లభించింది. బుధవారం పోలీసు కంప్యూటర్స్ అండ్ టెక్నికల్ విభాగం డీజీ వీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవార్డులు సాధించిన బృందాన్ని డీజీపీ జితేందర్ అభినందించారు. ప్రతిఏటా స్కోచ్ గ్రూప్ ప్రజాసేవలు, సామాజిక, ఆర్థిక అంశాలపై అవార్డులు అందిస్తుంటుంది. ఈసారి జాతీయస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో 'ఎలక్ట్రానిక్ ఇ-పెట్టీ కేసు.. మొబైల్ అప్లికేషన్' విభాగంలో తెలంగాణకు సిల్వర్ అవార్డు దక్కింది. 'స్మార్ట్ పోలీస్ స్టేషన్లు, స్మార్ట్ పోలీసింగ్, ఇంటిగ్రేటెడ్ పెట్రోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' విభాగాల్లో ఆర్డర్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్స్ దక్కాయి. ఈ అవార్డులను ఈనెల 15న న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్ నిర్వహించిన స్నాతకోత్సవంలో ఐటీసెల్ డీఎస్పీ ఎస్ రవిచంద్ర అందుకున్నారు.

బీసీల డిమాండ్లను కేంద్రం పరిష్కరించాలి

- జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలి
- చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలి
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నేతలు డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): బీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. జనగణనలో భాగంగా ఓబీసీ కులగణన జరపాలని, చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లో బుధవారం సమితి రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయనాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా శాసనసభ సమావేశాలు నిర్వహించి జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించి చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీసీల డిమాండ్లను ఆమోదింపజేయాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ రాష్ట్రంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వరరావు, నేదునూరి రాజమౌళి, లొడంగి శ్రవణ్‌కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, యేశాల అశోక్, సీహెచ్ దశరథ్, పెరుగు కుమార్, చింతకింది కుమారస్వామి, విజయుడు పాల్గొన్నారు.

'కంట్రోల్' తప్పిన భద్రత!

- పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనూ నకిలీలు
- టాస్క్‌ఫోర్స్ పోలీసునంటూ 2.8 లక్షల టోకరా
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- రాజకీయ సమీక్షలకు అడ్డాగా మారిన ఐసీసీసీ
- కొరవడిన భద్రతపై సర్వత్రా ఆందోళన

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం నడిబొడ్డున గత ప్రభుత్వ హయాంలో శత్రు దుర్భేధ్యంగా, అత్యాధునిక వసతులతో నిర్మించిన పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో భద్రత కంట్రోల్ తప్పింది. నిన్న మొన్నటి వరకూ రాజకీయ సమీక్షలకు అడ్డాగా మారిన ఈ ప్రతిష్ఠాత్మక పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నకిలీ పోలీసులు తిరుగుతూ భద్రతకు సవాల్ విసురుతున్నారు. తాజాగా ఐసీసీసీలో టాస్క్‌ఫోర్స్ పోలీసునంటూ బయట చెప్పుకుంటున్న హరిజన గోవర్ధన్ అనే వ్యక్తి.. ఓ బాధితుడి నుంచి రూ.2.8 లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఉదంతం బయటపడింది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులకు గోవర్ధన్ గురించి ఆరా తీసి.. అతను టాస్క్‌ఫోర్స్ పోలీసు కాదని తేల్చారు. దీంతో ఒక్కసారిగా ఐసీసీసీలో భద్రతా వైఫల్యం బట్టబయలైంది. ఇటీవల సచివాలయంలో వివిధ శాఖల ఉద్యోగులమంటూ నకిలీ ఐడీ కార్డులు సృష్టించుకుని కొందరు కలకలం సృష్టించిన ఘటనను మరువకముందే నేడు ఏకంగా ఐసీసీసీలో నకిలీ పోలీస్ తిరుగుతుండటం చర్చనీయాంశమైంది. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టు లో హాజరుపరచగా.. కోర్టు జ్యుడిషియల్ రిమాండ్‌కు విధించింది. ఈ ఘటన 2024 ఆగస్టులో జరగగా.. ఈ నెల 16న కేసు నమోదు చేసినట్టు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌గా చెప్పుకొని

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లా గుంతకల్ మండలం కాసాపురం గ్రామానికి చెందిన హరిజన్ గోవర్ధన్ కూకట్‌పల్లిలో మిల్క్ డిస్ట్రిబ్యూటర్‌గా పని చేస్తున్నాడు. అతను 2009 నుంచి 2014 వరకు ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో హోమ్‌గార్డ్‌గా పనిచేశాడు. కూకట్‌పల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జ్ఞానసాయిప్రదీప్ పరిచయం అయ్యాడు. తాను ఐసీసీసీలోని టాస్క్‌ఫోర్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నానని జ్ఞానసాయిప్రదీప్‌కు చెప్పాడు. హోటల్ వ్యాపారంలో లాభాలు ఉంటాయని బాధితుడిని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన ప్రదీప్ రూ.2,82,725 నకిలీ పోలీస్‌కు ముట్టజెప్పారు. వాస్తవానికి ఈ వ్యవహారం నిరుడు ఆగస్ట్ ముందే ప్రారంభమైంది. జనవరి 25న ఐసీసీసీలోకి వెళ్లి బాధితుడు ఆరా తీయగా గోవర్ధన్ విషయం బయటపడింది. దీంతో మోసపోయానని గ్రహించి బంజారాహిల్స్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఐసీసీసీలో భద్రతా వైఫల్యం!

ఇటీవల సెక్రటేరియట్‌లోకి నాలుగుసార్లు నకిలీ ఉద్యోగుల పేరిట గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లిన ఘటనలు మరువకముందే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, కట్టుదిట్టమైన భద్రత ఉండే ఐసీసీసీలోకి టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ అంటూ ఓ వ్యక్తి మూడుసార్లు వచ్చి వెళ్లడం భద్రతను ప్రశ్నిస్తున్నది. ఐసీసీసీలోకి ఎవరు వెళ్లాలన్నా చెకింగ్ పాయింట్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలి. గుర్తింపు కార్డు కూడా చూపించాలి. తాము ఎవరిని కలవాలో కూడా చెప్పాల్సి ఉంటుంది. మరి నకిలీ కానిస్టేబుల్ ఎవరిని కలవడానికి ఐసీసీసీకి వెళ్లాడు? ఎవరిని కలిశాడు? ఏం చెప్పి లోపలికి వెళ్లాడు..? అని నిఘావర్గాలు ఆరా తీస్తున్నాయి. బాధితుడు గత నెలలోనే ఐసీసీసీకి వచ్చి ఎంక్వైరీ చేసినట్టు తెలియడంతో.. ఈ వ్యవహారాన్ని బయటకు రానీయకుండా అప్పుడే నిందితుడిని అదుపులోకి తీసుకొని ఉంటే ఇంత రాద్ధాంతం జరిగేది కాదంటూ పోలీసు బాసు అధికారులను మందలించినట్టు తెలిసింది.

సీఎం సమీక్షలన్నీ అక్కడే..

సచివాలయంలో నిర్వహించే సమీక్షల వివరాలు క్షణాల్లో బయటకు పొక్కుతుండటంతో సీఎం రేవంత్, మంత్రులు రెగ్యులర్‌గా ఐసీసీసీలో సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిసింది. ఇక్కడ నిర్వహించే సమీక్షలు అత్యంత రహస్యంగా ఉంటున్నాయని తెలిసే ఐసీసీసీకి సీఎం ప్రాధాన్యం ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారిక సమీక్షలు కాకుండా.. రాజకీయ నేతలతో ఎప్పుడైతే ఐసీసీసీలో సమీక్షలు, సమావేశాలు, రహస్య భేటీలు నిర్వహించడం మొదలుపెట్టారో.. అప్పటి నుంచే భద్రత సన్నగిల్లిందని, కాంగ్రెస్ నాయకుల తాకిడి వల్లనే ఇక్కడికి కూడా నకిలీలు వస్తున్నారని ఓ పోలీసు అధికారి చెప్పారు.

తెలంగాణలో మిస్ వరల్డ్ అందాల పోటీలు!

- మరో అంతర్జాతీయ ఈవెంట్‌కు వేదిక కానున్న హైదరాబాద్
- మే 7-31 వరకు పోటీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ అందాల పోటీలకు తెలంగాణ వేదిక కానున్నది. 72వ మిస్ వరల్డ్ పోటీలను ఈ ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. నాలుగు వారాలపాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతో పాటు గ్రాండ్ ఫినాలే కూడా హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నారు. ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120 కి పైగా దేశాలు పాల్గొంటాయి. 'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే లక్ష్యంతో జరిగే ఈ మిస్ వరల్డ్ అందాల పోటీలకు దేశవిదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతున్నది. మే 7న ప్రారంభం కాగా, 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులివ్వాలి

చాడ వెంకటరెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): వీఆర్ఏల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రకటనలో రాష్ట్ర ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో వీఆర్ఏ జేఏసీతో చర్చలు జరిపి జీవో నం.81,85 ను గత ప్రభుత్వ విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు.

'హామీలు నెరవేర్చాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పవర్‌లూమ్ కార్మికులకు రెండు చీరల తయారీ బాధ్యతలను అప్పగించాలని చేనేత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ పోరాటానికి అన్ని పార్టీల మద్దతు తీసుకుంటామని వెల్లడించారు.

తప్పుడు ప్రచారం ఆపండి

ఆర్టీసీ జేఏసీ నేతల ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తేతెలంగాణ): సమ్మె నోటీసు ఇచ్చినప్పటి నుంచి ఆర్టీసీ యాజమాన్యం తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నదని జేఏసీ నాయకులు తెలిపారు. బుధవారం బస్‌భవన్, కూకట్‌పల్లి డిపోల వద్ద గేట్ మీటింగ్‌ను జేఏసీ నాయకులు నిర్వహించారు.

పాతబస్తీలో సర్వే డల్!

- 200 ఇండ్లలో దాదాపు 70 కూడా సర్వే చేయలే
- రీసర్వేలో ఎన్యుమరేటర్లు ఆ ఇండ్ల వివరాలు తీసుకోవాలి
- తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆదేశం
- క్షేత్రస్థాయి పర్యటనలో వెల్లడైన వాస్తవాలు

హైదరాబాద్, ఫిబ్రవరి19 (నమస్తే తెలంగాణ): పాతబస్తీలోని పలు ఇండ్లలో సర్వే సక్రమంగా జరగలేదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ చెప్పారు. దూద్‌బౌలి, ఉమ్డాబజార్, ఉస్మాన్‌బాగ్ తదితర కాలనీల్లో దాదాపు 200 ఇండ్లను తాము పరిశీలించామని, వాటిలో దాదాపు 60 నుంచి 70 ఇండ్ల వరకు సర్వే కాలేద